సర్పంచ్ ఎన్నికల్లో గుర్తుల కేటాయింపు

కడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడెం గ్రామ పంచాయతీలో పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు మరో వారమే మిగిలి ఉండగా, తాజాగా అభ్యర్థులకు అధికారులు గుర్తులను కేటాయించారు. దీంతో అభ్యర్థులు ఇంటింటా ప్రచారానికి సిద్ధం అవుతున్నారు.



గుర్తులను గోడకు అతికిస్తున్న దృశ్యం

డీఈడీ పరీక్షకు 79 మంది హాజరు

నిర్మల్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కస్బా యందు జరుగుతున్న డీఈడీ మొదటి సంవత్సరం పరీక్షల్లో భాగంగా బుధవారం 88 మంది విద్యార్థులకు గాను 79 మంది విద్యార్థులు హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మూడారపు పరమేశ్వర్ సందర్శించారు. పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తల్వేద వాసికి రైతు రత్న అవార్డు



రైతుకు అవార్డును అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిర్మల్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తల్వేద గ్రామానికి చెందని రైతు కోమటి బుచ్చన్నకి ప్రకృతి వ్యవసాయం దేశీయ వరి వంగడాలను భద్రపరచడం, విస్తరించడం వల్ల వారికి బుధవారం రంగారెడ్డి జిల్లాలోని కన్హ శాంతి వనం నందిగామలో మహా కిసాన్ మేళా సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతు రత్న అందజేసి సత్కరించినట్లు తెలిపారు.

జాంగాం పంచాయతీ ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికయిన సర్పంచ్ నవనీత

కుభీర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 3 : మండలంలోని జాంగామ్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బుధవారం మాన్కూర్ నవనీత సంజీవ్‌ను, ఉప సర్పంచ్‌గా మాగం రాజేశ్వర్‌తో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గత మూడు రోజుల నుంచి గ్రామస్తులు సమావేశం నిర్వహించి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా నవనీతకు ఏకగ్రీవంగా స్పంచ్‌గా ఎన్నుకున్నట్లు తీర్మానించారు. గత సర్పంచ్ ఎన్నిక కూడా ఏకగ్రీవంగా ముజాహిద్‌ఖాన్‌ను ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్నికయిన నవనీత మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని అన్నారు.

మందకొడిగా నామినేషన్లు దాఖలు

కుభీర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 17వ తేదిన జరుగనున్న మూడవ విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంతో బుధవారం మండలంలో నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. మండలంలోని 42 పంచాయతీలు 344వార్డుకు గాను పోటీలో చేసే అభ్యర్థులు 10 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా బుధవారం నామినేషన్ల దాఖలు మందకొడిగా సాగింది. మొత్తం సర్పంచ్ స్థానాలకుకు 42, వార్డు మెంబర్లు 51 నామినేషన్లు దాఖాలు అయినట్లు ఎంపీడీవో సాగర్‌రెడ్డి తెలిపారు.

రాజీమార్గాలు



కాంప్రమైజ్ పాలసీ

- ఉపసంహరణల కోసం ముమ్మర ప్రయత్నాలు
- ముమ్మరంగా ఒత్తిళ్లు
- భారీగా బేరసారాలు
- పంచాయతీ పోరులో వ్యూహ ప్రతివ్యూహాలు



నిర్మల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పంచాయతీ ఎన్నికలు ఆసక్తికర పరిణామాలను తెరపైకి తెస్తున్నాయి. చాలా గ్రామాల్లో సర్పంచ్ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు కాంప్రమైజ్ పాలసీని కొనసాగిస్తున్నారు. గతానికి భిన్నంగా పోటాపోటీగా సవాళ్ల ప్రతి సవాళ్ల లేకుండా ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఈ కాంప్రమైజ్ పాలసీని కొనసాగిస్తున్నారు. ఈసారి తనకు సర్పంచ్ పదవికి ఛాన్స్ ఇస్తే ఐదేళ్ల తరువాత జరిగే ఎన్నికల్లో తాను అలాగే తన వర్గమంతా సపోర్ట్ చేస్తామంటూ పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే మరికొన్ని గ్రామాల్లో ఈ సారి ఉప సర్పంచ్ పదవిని తీసుకోవాలని ఐదేళ్ల తరువాత సర్పంచ్ పదవిని కట్టబెడతామంటూ హామీలు ఇవ్వడమే కాకుండా ప్రమాణాలు సైతం చేస్తున్నారు. ముఖ్యంగా నిర్మల్ మండలంలోని పలు గ్రామాల్లో ఈ కాంప్రమైజ్ పాలిటిక్స్ జోరుగా సాగుతున్నట్లు చెబుతున్నారు. ఒకే కులం నుంచి ఇద్దరు ముగ్గురు నామినేషన్‌లు దాఖలు చేసినట్లయితే వారిలో నుంచి ఒకరిని పోటీకి నిలిపేందుకు ఆ కుల సంఘ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే పలు గ్రామాల్లో వివిధ పార్టీల మద్దతుదారులు ఇద్దరు ముగ్గురు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఇప్పుడు సర్పంచ్ బరి నుంచి తప్పుకున్నట్లయితే రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రాధాన్యతను ఇస్తామంటూ భరోసానిస్తున్నారు.

అన్ని రకాల ఒత్తిళ్లు

కాగా సర్పంచ్ పదవి కోసం ఒకే కుటుంబానికి చెందిన వారే అలాగే సమీప బంధువులు పోటీ పడుతున్న నేపథ్యంలో వారిలో నుంచి ఒకరిని మాత్రమే రంగంలో ఉండేట్లు చేసేందుకు బంధువులు పెద్ద వారు అలాగే వీడీసీ సభ్యులు రంగంలోకి దిగుతున్నారు.

రంగం నుంచి తప్పించేందుకు ముమ్మర యత్నాలు

పలు గ్రామాల్లో తమ ప్రత్యర్థులను ఎన్నికల బరి నుంచి తప్పించేందుకు పెద్దమొత్తంలో బేరసారాలు సాగిస్తున్నారని కూడా ఆరోపణలున్నాయి. లక్షల రూపాయల్లో ఈ కాంప్రమైజ్ పాలిటిక్స్ సాగుతున్నాయని అంటున్నారు. కొన్ని చోట్ల నగదుతో పాటు ప్లాట్లు కూడా ఇచ్చేందుకు ఒ ప్పందాలు కుదురుతున్నాయంటున్నారు. తమ ప్రత్యర్థులను బరిలో నుంచి తప్పించేందుకు చేయని ప్రయత్నమంటూ లేదంటున్నారు. ము ఖ్యంగా నిర్మల్, భైంసా, ముథోల్, ఖానాపూర్ పట్టణాలకు ఆనుకొని ఉన్న గ్రామ పంచాయతీల్లో ఈ కాంప్రమైజ్ పాలిటిక్స్ తారస్థాయికి చేరుకుంటున్నాయని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి స్వాగతం



సుదర్శన్ రెడ్డికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన శ్రీహరి రావు

నిర్మల్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి బుధవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు స్వాగతం పలికారు. ప్రభుత్వ సలహాదారులుగా మొదటిసారి జిల్లా కేంద్రానికి రావడంతో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో నిర్మల్ నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

మొక్కజొన్న బకాయిలు విడుదల చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో పీఏసీఎస్, ఎఫ్ఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన మొక్కజొన్న బకాయిలు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డికి నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావుతో కలిసి బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించి రూ.20 కోట్లు బకాయి చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే విడుదల చేయాలని కోరారు. స్పందించిన సుదర్శన్‌రెడ్డి సీఎం పేషీలో మాట్లాడి రైతుల ఖాతాల్లో వారం రోజుల్లో డబ్బులు జమ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

మర్యాదపూర్వకంగా కలిసిన మైనార్టీ నాయకులు



ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించినట్లు జిల్లా మైనార్టీ నాయ కులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జునైద్ మెమన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్ను, మతీన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణంలో చేపట్టిన రోడ్ల మరమ్మతుల పనులు నాణ్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్, అంబేద్కర్ చౌక్ సమీపంలో కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మర మ్మతులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గుంతల రోడ్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని వివరించారు. మరమ్మతుల పనులన్నింటినీ నాణ్యంగా చేయాలని పేర్కొన్నారు. మునిసిపల్ అధికారులు పనులను పర్యవేక్షించాలని సూ చించారు. వర్షాకాలం రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టాలని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ నుంచి ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఫుట్ పాత్‌కు మరమ్మతులు చేయాలని తెలిపారు. పట్టణంలో నిరంతరం మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. ఆటో స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి నిర్మాణం పూర్తయిన మినీ ట్యాంక్ బండ్ పార్కును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి హరిభువన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డ్రైవ్ ద్వారా పట్టణంలో రోడ్ల మరమ్మతులు

ప్రత్యేక డ్రైవ్ ద్వారా నిర్మల్ పట్టణంలో రోడ్లకు మరమ్మతులు చేపడతామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. వర్షాకాలం భారీ వరదల వల్ల రోడ్లు దెబ్బతిన్నాయని, దెబ్బతిన్న రోడ్లు అన్నింటికీ మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే రోడ్ల మరమ్మతులకు సంబంధించి దెబ్బ తిన్న రోడ్లను అధికారులు గుర్తించారని తెలిపారు. పట్టణ ప్రజలు ఎవరైనా తమ ప్రాంతంలో రోడ్లపై గుంతలు ఉన్నట్లయితే తాము ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా రోడ్లపై ఉన్న గుంతల ఫోటోలు వివరాలు నమోదు చేస్తే అధికారులు ఆ రోడ్లకు మరమ్మతులు చేపడతామని కలెక్టర్ చెప్పారు. కాబట్టి ప్రజలు తమ పరి సర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న గుంతల వివరాలను తెలియ జేయాలని కోరారు.

దివ్యాంగులు తమ అన్ని హక్కులను పొందాలి...

దివ్యాంగులు తమకు ఉన్న హక్కులన్నింటినీ పొందాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దివ్యాంగులకు ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలలో రిజర్వేషన్లను ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాయితీ రుణాలు పొంది వ్యాపారాల్లో రాణించాలని వివరించారు. జిల్లాలోని అన్ని కార్యాలయాలలో దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉండేలా అన్ని వసతులు కల్పించామన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా భవిత కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలో ఇప్పటికే 10 భవిత కేంద్రాలను అత్యంత ఆధునీకంగా నిర్వహిస్తున్నా మని, మున్ముందు మరి న్ని భవిత కేంద్రాలను ఆధునీక రించడంతో పాటు ఫిజియో థెరపిస్టులను అందుబాటులోకి తీసు కువస్తామని వివరించారు. అర్హులైన దివ్యాంగులకు యుడీఐడీ కార్డులను అందిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగుల హక్కుల గురించి అవగాహన కలిగేలా న్యాయ నిపుణులు, ఎన్జీవోలతో కలిసి ప్రత్యేక వర్క్ షాప్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఎటు వంటి సమస్యలు ఉన్న పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని, దివ్యాం గులకు ఇటీవలి నిర్వహించిన క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పలువురు దివ్యాంగులు కలెక్టర్, అధికారులను శాలువాతో సన్మానించి, పూల మొక్కలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాధిక, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో భోజన్న, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, దివ్యాంగులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరు లు పాల్గొన్నారు.

మత్స్య సంపదపై దృష్టి సారించాలి..

నిర్మల్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు మత్స్య సంపద పెంపుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని డ్యాంగాపూర్ గ్రామంలోని చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మత్స్యకారులు మత్స్య సంపద వల్ల ఆర్థికంగా బలపడవచ్చునన్నారు. విడుదల చేసిన చేప పిల్లలు, సరైన సైజుకు రాగానే చేపలను పట్టి విక్రయించి లాభాలు పొందాలని ఆదేశించారు. ఈ చేప పిల్లల విడుదల కార్యక్రమంలో ఏడీ ఫిషరీస్ రాజ నర్సయ్య, తహసీల్దార్ ప్రభాకర్, మత్స్యకారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి)లో రాంపూర్ రికార్డు

- నాలుగు గ్రామాలకు కేంద్రంగా అత్యధిక పోటీ

నర్సాపూర్(జి), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్(జి) మండల గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నాలుగు క్లస్టర్ల పరిధిలో నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) బుధవారం ముసిగింది. రిటర్నింగ్ అధికారులు అత్యంత పారదర్శకంగా నిర్వహించిన ఈ ప్రక్రియలో దాఖలైన 356 నామినేషన్లలో దాదాపు 100శాతం ఆమోదం పొందాయి.

నాలుగు క్లస్టర్లలో రాంపూర్ టాప్..

మండలంలోని నాలుగు క్లస్టర్లలోకెల్లా నాలుగు గ్రామాలకు కేంద్రంగా ఉన్న రాంపూర్ క్లస్టర్ పోటీలో అగ్రస్థానంలో నిలిచి ప్రత్యేక ఆకర్షణగా మారింది. మొత్తం 356 నామి నేషన్లలో రాంపూర్ క్లస్టర్ నుంచి అత్యధికంగా 121 నామినేషన్లు దాఖలయ్యాయి. (సర్పంచ్ 24, వార్డు 97) ఈ రికార్డు స్థాయి నమోదు స్థానిక రాజకీయాల్లో రాంపూర్ ప్రాధాన్యతను పెంచింది.

నామినేషన్ల ఆమోదం...

నాలుగు క్లస్టర్లలోనూ ఎక్కడా పెద్దగా అభ్యంతరాలు లేకపోవడంతో దాఖలైన ప్రతి నామినేషన్ ఆమోదానికి నోచు కుంది. దీంతో సుమారు 350 మందికి పై గా అభ్యర్థులు బరిలో నిలిచారు.

తుది సమరం సిద్ధం...

డిసెంబరు 5, 2025 సాయంత్రం 5గంటల తర్వాత తుదిజాబితా (ఫారం7ఏ)ప్రకటన ఉంటుంది. నాలుగు గ్రామాలకు కేంద్ర మైన రాంపూర్ క్లస్టర్ నుంచే అత్యధిక పోటీ ఉండటంతో నర్సాపూర్(జి) మండలంలో ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారనుంది.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



కుంటాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ కమల్‌సింగ్



ఆటల పోటీల్లో తలపడుతున్న దివ్యాంగులు

ముథోల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని భవిత విద్య విలీన కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల విద్యార్థులకు ఆట పాటలు, వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహు మతుల ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో రమణారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మం డల ఎంపీవో శివ కుమార్, హెడ్‌మాస్టర్ నర్సింగరావు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రం కుంటాల స్థానిక భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంఈవో ముత్యం పాల్గొని దివ్యాంగులకు పలు రకాల ఆటల పోటీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

దివ్యాంగులను ఆదరిద్దాం...

సోన్: దివ్యాంగులను సమాజం ఆదరించాలని, వారిని ఎప్పుడు కూడా చిన్నచూపు చూడవద్దని, వారిని జనజీవన స్రవంతిలో కలుపుకోవాలని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని లోకేశ్వరం మండల దివ్యాంగులు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. దివ్యాంగులు సమావేశం ఏర్పాటు చేసుకొని కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. దివ్యాంగులందరూ లోకేశ్వరం మండల అధ్యక్షుడు నరసింహ స్వామిని ఘనంగా శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.



మండల అధ్యక్షుడు నరసింహ స్వామిని సన్మానిస్తున్న దృశ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో



దివ్యాంగులకు బహుమతులు..

వైభవంగా దత్త జయంతి

- కనుల పండువగా సాగిన సాయి రథం ఊరేగింపు
- మంగళహారతులతో స్వాగతం పలికిన మహిళలు



దత్తాత్రేయ స్వామి ఆలయం



గర్భగుడిలో కొలువుదీరిన దత్తాత్రేయ స్వామి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో దత్త జయంతి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజు బుధవారం పట్టణ పుర వీధుల గుండా సాయిరథం ఊరేగింపు కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంట లకు సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు సాయంత్రం వరకు కొనసాగింది. పట్టణంలోని పలు కాలనీల్లో సాయి రథాన్ని భక్తులు దర్శించుకున్నారు. ముఖ్యంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, ఆలయ ఈవో భూమయ్య, ఆలయ ఛైర్మన్ బురాజ్, సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, శివ కుమార్, ఈశ్వర్, గంగాధర్, నారాయణ రెడ్డి, కోల శంకర్, ప్రకాష్ గౌడ్, హరి, పరమేశ్వర్, జొన్నల మనోహర్, పాతర్ల శ్రీనివాస్, రేఖ, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.



సాయి రథం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

దత్త జయంతికి ఏర్పాట్లు పూర్తి

నిర్మల్ రూరల్: పట్టణంలోని దత్తాత్రేయ నగర్ కాలనీలో గల దత్తాత్రేయ ఆలయంలో దత్త జయంతి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మా ట్లాడుతూ దత్త జయంతి సందర్భంగా ఉదయం అభిషేకం, సహస్ర నామార్చన, పుష్పార్చన, గురు మంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యా హ్నం ఒకటి గంటల నుంచి అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్

'పర్ధాన్ కులస్థులకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలి'

మావల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పూరి గుడిసేలలో నివాసముంటున్న ఆదివాసీ పర్ధాన్ కులస్థులకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరా సుకా దేవస్థానంలో ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీ పర్ధాన్ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ రంగాలతో పాటు వివిధ రంగాలలో వెనుకబడి ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా వారి అభివృద్ధి కోసం ప్రత్యేకమైన చొరవ తీసుకోవాలన్నారు. ఐటీడీఏ ఏర్పాటు నుంచి ఆదివాసీ పర్ధాన్ కులస్తులకు అంతంత మాత్రంగానే సంక్షేమ పథకాలు అందాయని, ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అంతేకాకుండా నామినేటెడ్ పదవులలో అవకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు మెస్రం శంకర్, గేడం మాధవ్, కుడ్మేత ప్రకాష్, కుమ్ర ధర్మజీ, దుర్వే ప్రదీప్, గేడం రాంచందర్, మెస్రం నారాయణ, తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రిమ్స్‌తో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.26 వేల కనీస వేతనం ఇచ్చే విధంగా టెండర్‌లో పొందుపర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. బుధవారం రిమ్స్‌లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం, జిల్లా అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ.. రిమ్స్‌లో కాంట్రాక్ట్ టెండర్ పూర్తి అయి మూడు సంవత్సరాలు అయ్యిందన్నారు. నూతన టెండర్‌ను పిలిచి కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించేలాల టెండర్‌లో పొందుపర్చాలన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కింద రిమ్స్ కార్మికులు, సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిలో పని చేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్ సిబ్బందికి పదోన్నతులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సిర్ర దేవేందర్, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

నామినేషన్ సెంటర్ వద్ద బందోబస్తు

బోథ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో బుధవారం రోజున ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాలలో నామినేషన్ కేంద్రాల ముందు పోలీసులను నియమించారు. నామినేషన్ ప్రక్రియను స్థానిక సీఐ గురుస్వామి ఎస్సై శ్రీసాయిలు పర్యవేక్షించడం జరిగింది.



బోథ్‌లోని నామినేషన్ సెంటర్ వద్ద బందోబస్తు పర్యవేక్షిస్తున్న సీఐ

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగాలతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైందని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుడు శ్రీకాంత చారి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంతా చారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన త్యాగ నిరతిని స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ఈ మేరకు జోగు రామన్న మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమంలో శ్రీకాంత చారి త్యాగం చిరస్మరణీయంగా నిలిచిపోతుందని అన్నారు. అమరుల త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడిందని పేర్కొన్నారు. వారి ఆశయాలను సాధించే దిశగా ప్రతీఒక్కరు ముందుకు సాగాల్సిన అవసరముందన్నారు. ఇందులో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు సామన్ పెళ్లి నరసింహులు, ప్రధాన కార్యదర్శి స్వామి, కోశాధికారి దశరథ్, అశోక్, రవి, నరసింహులు, బీఆర్ఎస్ నేతలు అలాల్ అజయ్, రాజు, ధమ్మపాల్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత చారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి జోగురామన్న, నేతలు

ప్రజా సంక్షేమంలో ప్రభుత్వం విఫలం

రాష్ట్రంలో అన్నదాతలు పడరాని పాట్లు పడుతుంటే ముఖ్యమంత్రి ఫుట్ బాల్ ఆటలో బిజీగా గడుపుతున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు. అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మాజీమంత్రి జోగురామన్న మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఆదిలాబాద్ పర్యటన అర్థరహితమని మండిపడ్డారు. ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలిచామన్న ఆయన... ప్రస్తుత ప్రభుత్వం విధానాలతో అన్నదాతలు ముప్పుతిప్పలు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విజయోత్సవ సభలను నిర్వహించడం వెనక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇందులో నాయకులు అలాల్ అజయ్, సాజిదోద్దీన్, మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జోగురామన్న

హిందూ దేవతలపై సీఎం వ్యాఖ్యలు సరికావు : బీజేపీ

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లను కించపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ అన్నారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మ దహనం చేసే కార్యక్రమానికి బీజేపీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు కలెక్టర్ చౌక్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. అందులో ఉన్న దిష్టిబొమ్మను లాక్కున్నారు. అనంతరం ఆయనను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఎం రేవంత్ రెడ్డి హిందూవులు, హిందూ దేవతలపై అనుచితంగా మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా బ్రహ్మానంద్ మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

సీఎం హిందువుల ద్రోహి : రితేష్‌రాథోడ్

ఉట్నూర్: హిందువుల ద్రోహిగా మారుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు రాలేరని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హిందూ దేవీ, దేవతల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. రేవంత్‌రెడ్డి హిందూ ద్వేష వైఖరికి వ్యతిరేకంగా, హిందూ సమాజంపై వ్యంగ్య భాషను వాడి, అనుచిత వ్యాఖలు చేసి తన హిందూ ద్వేషాన్ని వెళ్లగక్కారని, హిందూ దేవి దేవతల జోలికి వస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఎం విద్వేషపూరిత వైఖరికి నిరసనగా నిర్మల్ జిల్లాలోన నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మొన్న జరిగిన జూబ్లిహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. మళ్లీ ఇప్పుడు హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చూస్తుంటే ఆయన పూర్తిగా హిందూ వ్యతిరేకిగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వర్గాన్ని తృప్తి పరిచే ప్రయత్నం చేస్తూ కోట్లాది హిందువుల విశ్వాసాలపై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని రితేష్ రాథోడ్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి హిందూ దేవీదేవతలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను హిందూ సమాజం గమనిస్తుందని, రాబోయే రోజుల్లో తగిన బుద్ది చెబుతారని స్పష్టం చేశారు. ఇందులో కొండేరి రమేష్, బానోత్ సంగీత, శ్రీరామ్ నాయక్, రాథోడ్ శేషరావు, కోలిపాక రాజశేఖర్, ఉప్కిమల్ల దేవిదాస్, కాల్వరవి, బానోత్ ఉపేందర్, బొడ్డు కిరణ్, కాలేరి గంగాధర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రితేష్‌రాథోడ్

లేబర్ కార్డు ఉన్న వారికి వైద్య సేవలు

బోథ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): లేబర్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కో ఆర్డినేటర్ సయ్యద్ పర్వేస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్మికులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ముఖ్యంగా మహిళలకు సంబంధించిన థైరాయిడ్, హెచ్ఐవీ క్యాన్సర్ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 8 రోజులలో జరిపిన పరీక్షలకు సంబంధించి వివరాలు తెలుపుతామన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యురాలు శ్వేత, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



బోథ్‌లో వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పోటాపోటీ

(5వ పేజీ తరువాయి...)

జిల్లా అధికారులు ఏర్పాట్లు చేసినా.. కేంద్ర ప్రభుత్వం అనుమతించక పోవడంతోనే వాయిదా వేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో రూ.23.79 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ ఆసుపత్రితో పాటు, రూ.34 కోట్ల వ్యయంతో నిర్మించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం పనులు పూర్తయ్యాయి. దీంతో అధికారులు సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. కానీ అంతలోనే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల జాబితా నుంచి క్రిటికల్ కేర్, కేంద్రీయ విశ్వ విద్యాలయాలను తొలగించడంపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం లేఖలు రాసినా.. ఎలాంటి స్పందన లేదని తెలుస్తుంది.

బీజేపీ సరికొత్త వ్యూహం

కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన క్రిటికల్ కేర్, కేంద్రీయ విశ్వవిద్యాలయ భవనాల ప్రారంభోత్సవాల విషయంలో బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుందన్న టాక్ వినిపిస్తుంది. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరలోనే కేంద్ర మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించే విధంగా బీజేపీ నేతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆపైగా స్థానిక ఎన్నికలు రావడంతో బీజేపీ అప్రమత్తమై ఆచితూచిగా అడుగులు వేస్తుంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే కొంత ఇబ్బందికరంగా ఉంటుందన్న ఆలోచనలో బీజేపీ ఉన్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీకి ఇమేజ్ రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని అధికార పార్టీ ఆరోపిస్తుంది. ఈ విషయంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు అంతర్గతంగా రగిలి పోతున్నట్లు తెలుస్తుంది. అయితే జిల్లా నేతల ఒత్తిళ్లతోనే కేంద్రం అనుమతించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులపై ఒత్తిడి

పూర్తయిన అభివృద్ధి పనులను సీఎం చేతుల మీదుగా ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధికారులను ఆదేశించినట్లు తెలుస్తుంది. కానీ బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వ అనుమతి పేరిట అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికార ప్రతిపక్ష పార్టీల నేతల తీరుతో జిల్లా అధికారులు అయోమయానికి గురవుతున్నా రు. ఇరు పార్టీల నేతలు అధికారులపై ఒత్తిడి చేయడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పనులు పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా.. అభివృద్ధి పనులను ప్రారంభించక పోవడం ఏమిటన్న? ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సీఎం చేతుల మీదుగా ప్రారంభించాలని కాంగ్రెస్ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తుండగా.. అనుమతి లేదంటూ బీజేపీ నేతలు చెప్పడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. బుధవారం రాత్రి వరకు ఎలాంటి అనుమతులు రాలేవని గురువారం మధ్యాహ్నం వరకు ఏం జరుగుతుందో? చెప్పలేని పరిస్థితులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

అనారోగ్యంతో ఉన్న టీచర్లకు ఎన్నికల విధులు వద్దు : ఎస్టీయూ

ఉట్నూర్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీ ఎన్నికల విధులకు అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు కేటాయించవద్దని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా పంచాయతీ అధికారిని కోరింది. బుధవారం జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో ఆయనను కలిసి ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ రవికుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పోలింగ్ నిర్వహణ కోసం హాజరవుతున్న ఎన్నికల సిబ్బంది ఎన్నికల విధుల నిర్వహణకు తగు సౌకర్యాలను కల్పించాలని ప్రాతినిధ్యం చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులను, దివ్యాంగుల ఉపాధ్యాయులను, 58ఏళ్ల వయస్సు నిండిన వారిని, అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులను ఎన్నికల విధుల ఉంచి మినహాయించాలని కోరామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా చలికాలం దృష్ట్యా స్నానానికి వేడి నీళ్లు, రుచికరమైన భోజనం, తగిన వసతి సౌకర్యాలు కల్పించాలని కోరామన్నారు. అదే విధంగా పోలింగ్ ముగిసిన తర్వాత డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సిబ్బంది వారి స్వస్థలాలకు చేరుటకు తగిన బస్సు సౌకర్యాలను కల్పించాలని పేర్కొన్నారు.

అంజనీ తండా వర్సెస్ సాయి నగర్

▶▶ గుర్తుల లాటరీతో గ్రామ పోరు

నర్సాపూర్(జి) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్(జి) మండలంలోని నూతన గ్రామ పంచాయతీ అయిన అంజనీ తండాలో రెండోసారి జరుగుతున్న సర్పంచ్ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. కుస్లీ గ్రామ పంచాయతీ నుంచి విడిపోయిన ఈ ప్రాంతంలో, ఈసారి ప్రధాన పోటీ అంజనీ తండా, సాయినగర్ తండా మధ్య నెలకొంది.

తండాల మధ్య ఉత్కంఠ..

చిన్న గ్రామ పంచాయతీ అయినప్పటికీ సర్పంచ్ పదవికి ముగ్గురు అభ్య ర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ముఖ్యంగా రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరి పేర్లు ఒకటే కావడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఇద్దరు అభ్యర్థుల పేర్లు ఒకేలా ఉన్నందున రిటర్నింగ్ అధికారి (ఆర్వో) ఎన్నికల నిబంధనల ప్రకారం లాటరీ పద్ధతి ద్వారానే వారికి ఉచిత గుర్తులను కేటా యించాల్సి ఉంటుంది. నూతన పంచాయతీగా ఏర్పడటాన్ని ఇక్కడి ప్రజలు అదృష్టంగా భావిస్తుండగా, ఈసారి విజయం ఏ తండాను వరిస్తుందోనని స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డిసెంబరు 2, 2025 సాయంత్రం 5 గంటల తర్వాత నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన వెంటనే ఈ హోరాహోరీ పోరులో లాటరీ అదృష్టం ఎవరిని వరిస్తుందో, వారి రాజకీయ భవిష్యత్తును ఏ గుర్తు నిర్ణయిస్తుందో స్పష్టమవుతుంది.

4 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఏకగ్రీవం..



నాగపూర్ వెంకట్రాములు | కోసగుట్ట టేకం నాగుబాయి | జంగుగూడ శశికళ | రాంనగర్ లింగన్న

పెంబి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు గాను 4 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నిక య్యాయి. మండలంలో 152 వార్డులకు గాను 124 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. నాగ పూర్ సర్పంచ్‌గా బోసు వెంకట్రాములు, జంగుగూడ సర్పంచ్‌గా సీడం శశికళ శంకర్, కోసగుట్ట సర్పంచ్‌గా టేకం నాగు బాయి, రాంనగర్ సర్పంచ్‌గా లింగులు ఎన్నికైనట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. 20 గ్రామ పంచాయతీలకు 71 మంది సర్పంచ్ అభ్యర్థులు, 28 వార్డులకు 68 మంది పోటీలో ఉన్నారని తెలిపారు.

నర్సాపూర్‌లో పరిశీలన పూర్తి

▶▶ ప్రశాంతంగా ముగిసిన పరిశీలన

నర్సాపూర్(జి), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ జిల్లాలోని నాలుగు క్లస్టర్ల పరిధిలో ఎన్నికల నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ బుధవారం రాత్రికి ప్రశాంతంగా పూర్తయ్యింది. రిటర్నింగ్ అధి కారులు (ఆర్‌వోఎస్) ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951 నిబంధనల ప్రకారం క్వాసీ-జ్యుడీషియల్ విధిని నిర్వర్తించారు. అన్ని నామినేషన్ పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. చట్టపరమైన, ముఖ్యమైన లోపాలు లేకపోవడంతో మెజారిటీ నామినేషన్లు ఆమోదం పొందాయి. ఈ రోజు పరిశీలనలో ఏ అభ్యర్థిపై కూడా అనర్హత దరఖాస్తులు దాఖలు కాలేదు. ఇది దాఖలైన పత్రాల నాణ్యతను సూచిస్తుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లలోని నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతల వివరాలు ఎన్నికల సంఘం డిజిటల్ పోర్టల్స్ ద్వారా అందుబాటులో ఉంచబడ్డాయి. కొన్ని క్లస్టర్లలో నోటీసు బోర్డులపై నేర చరిత్ర వివరాలు వెంటనే బహిర్గతం కానప్పటికీ ఈ సమాచారాన్ని త్వరలోనే ఫారం 7ఏ (తుది జాబితా) ద్వారా ప్రజలకు పూర్తి పారదర్శకతతో అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

పరిశీలకులు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

▶▶ జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) తమ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ ఆయేషా మస్రత్ ఖానం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశాలకులు మాట్లాడుతూ... మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వహించబోయే అధికారులకు ముందుగానే సమాచారం అందించామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ఓటు విధానాన్ని వినియోగించుకొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. శిక్షకులు అందించిన సమాచారాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ, ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం: కలెక్టర్

పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సూక్ష్మ పరి శీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఎన్నికకు ముందు, ఎన్నిక సమయంలో, ఎన్నిక తర్వాత, ఓట్ల లెక్కింపు సమయంలో అనుసరించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. సమయానుసారం ఓటింగ్ నమోదు వివరాలనుపై అధికారులకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లకు అందించిన కరదీపికలను అనుసరించాలని చెప్పారు. ఎటువంటి సందేహాలు ఉన్న పైఅధికారులను సంప్రదించాలని సూచించారు. రెండో దశలో భాగంగా మరోసారి సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్దేశించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. పలువురు శిక్షకులు మైక్రో అబ్జర్వర్లకు తమ ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డీపీవో శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఎల్‌డీఎం రామ్‌గోపాల్, శిక్షకులు, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమాజానికి సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి



నిర్మల్‌లో సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



భైంసాలో...

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను అవమాన పరుస్తూ, హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా మాట్లాడడాన్ని నిరసిస్తూ బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ముస్లిం అంటే కాంగ్రెస్ కాంగ్రెస్ అంటే ముస్లిం అని మాట్లాడిన రేవంత్ రెడ్డి హిందువులను, హిందూ దేవీదేవతలను ఇలా అవమానపరచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మతస్తుల దేవుళ్లపై వ్యాఖ్యలు చేసే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. హిందూ దేవుళ్ళను తూలనాడిన సీఎం ముక్కు నేలకురాకి హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, అల్లం భాస్కర్, శ్రీరామోజీ నరేష్, పట్టణ ఉపాధ్యక్షులు ఓడ్నాల రాజు, నాయకులు పొన్నం నారాయణ గౌడ్, ఆడెపు సుధాకర్, తోట సత్యనారాయణ, అయ్యన్నగారి రాజేందర్, కొండాజి శ్రావణ్, విజయ్, జాప ప్రసాద్, గంజి రాజు, రంజిత్, దిలీప్, సాత్విక్, రాము, మహేష్, రవి, లింగం, బంటి, పట్టణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

భైంసా: హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు రావుల రాము, జిల్లా నాయకులు యనుపోతుల మల్లేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబోమ్మను దహనం చేశారు. రెండ్రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను కించపర్చే విధంగా వ్యాఖ్యాలు చేశారని ఆరోపించారు.

ఆర్‌జీయూకేటీలో సమ్మేళనం

బాసర డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్‌జీయూకేటీలో స్పిక్ మైకే తెలంగాణ రాష్ట్ర సమ్మేళనం బుధవారం ఘనంగా ప్రా రంభమైంది. నాలుగు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో తొలి రోజు హఠయోగ (జార్నా మోహన్) నాదయోగ (కుమార్ మార్డుర్, మంద సుధారాణి) సెషన్లు జరిగాయి. చెరి యల్ మాస్క్, నిర్మల్ పెయింటింగ్, మధుబని, చిత్రారా, పెరిని శివతాండవం, ఆంధ్రనాట్యం (గురు కళా కృష్ణ) వంటి పలు క ళా రూపాలలో ఇంటెన్సివ్ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. డా. పెరిని కుమార్ పెరిని శివతాండవం, డా. మామిడి హరికృష్ణ తెలంగాణ చరిత్ర పై ప్రదర్శన ఆలోచింపచేసాయి. ప్రసిద్ధ సితార్ విద్వాంసుడు పండిట్ శుభేంద్ర రావు ప్రదర్శన, కుమార్ మార్డుర్ హిందుస్తానీ వోకల్ కచేరీ ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని, శారీరక-మానసిక సమతుల్యతను పెంపొందించిందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు.



కళాకారుల ప్రదర్శన

పన్ను చెల్లింపులతో పంచాయతీలకు ఆదాయం

కుభీర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 3 : ఇంటి పన్ను చెల్లించాలని పంచాయతీ సిబ్బంది ఇంటింటికి తిరిగిన వచ్చేవి కాదు. సర్పంచ్ ఎన్నికల పుణ్యమా అని పోటీదారులే కార్యాలయాలకు వచ్చి చెల్లిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు పన్నులు పెండింగ్ లేకుండా సక్రమంగా ఉంటే నామినేషన్‌కు అర్హులు ఒక్కో పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థితో పాటు వార్డు స్థానాలకు పోటీ చేసేవారు చెల్లిస్తుండడడంతో ఆదాయం సమకూరుతోంది. మూడవ విడత నామినేషన్లు బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో క్లస్టర్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌సెంటర్‌ల వద్ద పోటీ చేసే అభ్యర్థులు ఇంటి పన్ను చెల్లించేందుకు బుధవాం కుభీర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంముందు వేచి ఉన్నారు. ఈ కేంద్రాన్ని డీఎల్‌పీవో లక్ష్మణ్, ఎంపీవో భూమేష్ పరిశీలించి పలు సూచనలు చేశారు.



ఇంటి పన్ను చెల్లిస్తున్న గ్రామస్థులు

శ్రీకాంతాచారికి ఘన నివాళి

భైంసా, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ మలి దశ ఉద్యమ తొలి అమరవీరుడు శ్రీకాంతాచారికి ముథోల్ బీఆర్ఎస్ శ్రేణులు ఘన నివాళులు అర్పించారు. బుధవారం శ్రీకాంతచారి వర్ధంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు డా. విలాస్ గాదేవార్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ మాట్లాడుతూ శ్రీకాంతాచారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధన కోసం ఆత్మార్పణం చేసుకున్న శ్రీకాంతాచారి త్యాగనిరతిని తెలంగాణ సమాజం ఎప్పటికి మరిచిపోదని వెల్లడించారు. ప్రభుత్వం అమరవీరుడైన శ్రీకాంతాచారి జీవిత చరిత్రను, త్యాగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో బీమేష్, అమీర్, బెజ్జంకి రవి, మహేష్, సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.




భైంసాలో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నామినేషన్లు సజావుగా జరిగేలా చూడాలి

భైంసా రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ సందర్భంగా జిల్లా ఎన్నికల పరిశీలకురాలు ఆయేషా మస్రత్ ఖానం నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్ పత్రాలు ఎటువంటి అవకతవకలు జరుగకుండా పకడ్బందీగా తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఆమె వెంట భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, భైంసా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో నీరజ్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నామినేషన్లు

భైంసా రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలంలో 30 గ్రామ పంచాయతీ నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. బుధవారం భైంసా మండలంలో మొత్తం 31 సర్పంచ్ నామినేషన్లు నమోదు అయ్యాయి. అదేవిధంగా వార్డు మెంబర్లకు 55 నామినేషన్లు నమోదైనట్లు మండల అధికారి, ఎంపీడీవో నీరజ్ కుమార్, ఎంపీవో ప్రదీప్ కుమార్ తెలిపారు.



మనకైతే అవకాశం లేదు

● మనవాళ్లనైనా ఎన్నికల బరిలో దించుదాం

బోథ్,డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఈసారి రిజర్వేషన్ల పుణ్యమా అని కొంత మందికిరిజర్వేషన్లు కలిసి రాక పోవడంతో వారి కుటుంబీకులను రం గంలోకి దించాలని నిర్ణయించుకు న్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా బోథ్ మండల కేంద్రంలో సర్పంచ్ స్థానం ఎస్సీమహిళలకుకేటాయిం చ డంతోఆ స్థానం నుంచి గతంలో పోటీ ఏయాలనేఆ లోచించి న ఆవర్గాని కిచెందిన నాయకులు వారివారి కుటుంబాల వారిని రంగంలోకి దించుతున్నారు. అయితే కలిసి రాని రిజర్వేషన్లను వి నియోగించుకునేందుకు పురుషుల స్థానంలోమహిళలను ఎన్నికల రంగం లోకి దించనున్నట్లుసమాచారం.

ప్రభుత్వ ఉద్యోగుల భార్యలు ఎన్నికల రంగంలోకి..

రాజకీయాల ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు కొంత మంది ఈసారి తమ భార్యలను ఎన్నికల బరిలోకి దించనున్నట్లు సమాచారం.ఈ దిశగా ప్రభుత్వ ఉద్యోగులు కొందరు పావు లు కదుపుతున్నారు. ప్రభుత్వ ఉద్యో గుల కుటుంబీకులు గనుక ఎన్నికల బరిలోకి దిగితే పోటీ తీవ్రమయ్యే అ వకాశాలు ఉన్నాయని కొందరంటు న్నారు. కొన్ని గ్రామాలలో ఇప్పటికే బ రిలోకి దిగేవారు ప్రచారాన్ని తీవ్రత రం చేస్తున్నారు. దీంతో గ్రా మాలలో ఎన్నికల వేడి ప్రా రంభమైంది.

సమస్యలను పరిష్కరించండి

కుల సంఘాల వారు ఈ సారి ఎన్నికల బరిలో దిగేవారిని కులాల వారీగా తమ తమ డిమాండ్లను పోటీ చేసే అభ్యర్థుల ముందు పెట్టమన్నా రు. మాకు సంఘ భవనాన్ని నిర్మించి ఇవ్వాలి అంతేకాక కొన్ని సంఘాల వా రైతే మాసంఘానికి అవసరమైన వం ట పాత్రలను టెంట్లను కొన్ని ఇవ్వాల ని కోరుతున్నట్లు తెలిసింది. కుల సంఘాల వారి కోరికలు తీర్చాలంటే అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపిడి కా నుంది. ఏదేమైనా ఈ సారి బరిలోకి దిగేవారికి ఎన్నికల ఖర్చు భారీగా ఉంటుందని పేర్కొంటున్నారు.

నామినేషన్ల ఉప సంహరణకు బేర సారాలు

ఉట్నూర్/ఇచ్చోడ,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):మండలంలోని గ్రామపంచాయతీలు, వార్డుమెంబర్ల నామినేషన్‌ల ఉపసంహ రణ గడువు బుధవారం ఉండడంతో గత రెండు రోజులుగా పోటీలో ఉన్న అభ్యర్థులను రాజీచేసుకోవడానికి నామినేషన్ల ఉపసంహరణ కోసం బేరసారాలు మొదలయ్యాయి. ఉట్నూర్ మండలంలో 38 గ్రామ పంచాయతీలు ఉండగా ఆరు గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు,వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్ని గ్రామ పంచాయతీలలో కూడా వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడంతో సర్పంచ్ అభ్యర్థుల మధ్య తీవ్రపోటీనెలకొంది. నువ్వా-నేనా అనేవిధంగా ఇద్దరుసర్పంచ్ అభ్యర్థులు ఉన్న చోట మాత్రం బేరసారాలు సాగుతున్నట్లు తెలుస్తుంది.పోటీలో ఉంటే సర్పంచ్ కావాలనుకునే వారికి సు మారు లక్ష రూపాయలు ఖర్చు అవుతాయని భవిస్తున్న వారు సగం లక్ష ఇస్తే నామినేషన్ ఉపసంహరించుకుంటామ ని పేర్కొంటున్నట్లు తెలుస్తుంది.

అన్న..జర చూడరాదే

బరిలోనుంచితప్పించుకుంటే నగదు నజరానా అందిస్తా మని ఆశ, ఏలాగైన గెలవాలని అభ్యర్థుల తపన, తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న ఏజెన్సీ ప్రాంతంలో సర్పంచి వార్డు సభ్యులకు భారీగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. గెలిచి తీరాలనే పట్టుదలతో అభ్యర్థులు బరిలో దిగారు. ఒక్కో వార్డుకు 3 నుంచి 6 మంది వరకు అభ్యర్థులు పోటీకి సై అంటుం డడంతో తమకు తెలిసిన వారిని పోటీ నుంచి తప్పించేం దుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. నామినేషన్ల ఉపసంహ రణకు అవకాశం ఉండడంతో కాస్తా మమ్మల్ని చూడండి.. నాకోసం పోటీ నుంచి తప్పుకో అన్న అంటూ.. బతిమిలాడు తున్నారు. కొందరైతే నగదు నజరానా అందిస్తామని ప్రత్య ర్థులకు ఆశచూపుతున్నారు.మరి కొందరై తే గతంలో ఎప్పుడు మాకుటుంబ సభ్యులు, మా జాతి వారు గెలవ లేదు. ఈ సారి మాజాతి అబ్బాయి కోసం మీరు పోటీ నుంచి తప్పు కోవాలని పెద్దలతో ఒప్పించే యత్నాలు చేస్తు న్నారు. బుధ వారం మధ్యాహ్నం వరకు నామపత్రాల ఉపసం హరణకు గడువు ఉండడంతో ఎంత మంది పోటీలో ఉంటా రనే లెక్క తేలనుంది. దీంతో నలుగురు కలిసిన ప్రతి చోట ఇదే విషయంపై చర్చలు కొనసాగుతున్నాయి.

ముగిసిన సాయి నామస్మరణ



కల్లూరు దత్త వెంకట సాయి ఆలయంలో కొనసాగుతున్న యజ్ఞం

కుంటాల, డిసెంబరు, 3: (ఆంధ్రజ్యోతి): కుంటాల మండలంలోని కల్లూ రు దత్త వెంకట సాయి మందిరంలో దత్త జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న బుధవారం ప్రారంభమైన ఉత్సవాలు రేపటితో ముగియను న్నాయి. బుధవారం ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి సాయి నామ సంకీర్తన పారాయణం సమాప్తి కార్యక్రమం నిర్వహించారు. శ్రీరుద్ర సహిత నవ చండి అనగాదేవి సహిత శ్రీదత్తాత్రేయ మూల యంత్ర యజ్ఞ యాగం కొనసాగుతుంది. ఆఖరి రోజైన గురువారం యజ్ఞ పూర్ణాహుతి వేద పండి తుల ఆశీర్వచనం, తీర్థ ప్రసాదము, దత్తాత్రేయ జననం, డోలారోహణం, ఉపనయనం, గోపాల కాల, భిక్షాటన , మహా ప్రసాద కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు, రాత్రి దత్తాత్రేయ స్వామి పాదుక దర్శనం, పల్లకి సేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



బాసరలో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప దీక్ష దారులు

బాసర,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):బాసర పుణ్యక్షేత్రంలో బుధవారం రో జున అయ్యప్పస్వామి మహాపడిపూజ మహోత్సవాన్ని అంగరంగవైభ వంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామానికి చెందిన అంతగిరి సవిత -మాధవ్ దంపతుల నివాసం వద్ద ఈ పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశా రు. గురుస్వాములు అయిన కిష్టాగౌడ్ , మహేష్ రావు ఆధ్వర్యంలో మహా పడిపూజను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.'స్వామియే శరణం అయ్య ప్ప..శరణంశరణం అయ్యప్ప' అనే దివ్య నామస్మరణతో మార్మోగాయి. ఈ మహోత్సవానికి పెద్దసంఖ్యలో అయ్యప్పస్వాములు, దీక్షాధారులు స్థానిక భక్తులు హాజరయ్యారు.హాజరైన భక్తులుస్వాములు ఉత్సాహంగా అ య్యప్ప నామస్మరణ చేయడంతో పాటు, భజనపాటలు, భక్తి గీతాలను ఆలపిం చారు. పడిపూజ అనంతరం, కార్యక్రమానికి విచ్చేసిన అయ్యప్ప స్వా ముల కు, భక్తులకు అన్నదాన ప్రసాదం (మహాభిక్ష) ఏర్పాటు చేశారు.ఈ కార్య క్రమంలో గ్రామానికి చెందిన భక్తులు, అయ్యప్ప సేవకులు, గ్రామ స్థులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

» కొమురం భీం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

నార్నూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కొమురం భీం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. బుధవారం మండలంలోని ముక్తాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామస్థులు ఘనంగా స్వాగతం పాలికారు. గ్రామస్థులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అభి వృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు అమ లులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచి అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి సుమారు 100 మందికి పైగా వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి పార్టీ కండువా కప్పి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత పాలకుల హయాంలో పేదల బస్తీల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావు లోకండే, కేశవ్ పటేల్, నాగుబాయి, పాక్స్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, షేక్ మొహ్మద్, షేక్ దస్తగిర్, సంతోష్ మానే పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ మండలం లింగుగూడ, లోహార, చించుగాట్ గ్రామాల నుంచి పలువురు నేతల్లీ పోరెడ్డి కిషన్ ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీని వాస రెడ్డి కండువాలు పార్టీ లోకి ఆహ్వానించారు. అంతా కలిసి స్థానిక ఎన్ని కలలో విజయం సాధించేందుకు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముడుపు దామోదర్ రెడ్డి, గిమ్మసంతోష్, కొండ గంగాధర్,గు డిపల్లి నగేష్,సుధాకర్ గౌడ్, దేవిదాస్ చారి, రాజ్ మహ్మద్ పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డికి ఘన స్వాగతం



సుదర్శన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ:ఆదిలాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం పర్య టనకు సంబంధించి వివి..ద మండ లాల ముఖ్య నాయకులతో సమా వేశం కావడానికి విచ్చేసిన తె లం గాణ ప్రభుత్వ సలహాదారు పొద్దు టూరు సుదర్శన్ రెడ్డిని బుధవారం నేర డిగొండ మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డిలు ,స్వాగతం పలికారు. నేడు జరగబోయే సీఎం కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు. కార్యకర్తలు తరలి వచ్చేలా చూడాలని కోరారు. వీరి వెంట మండల కన్వీనర్ వసంత్ రావు, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, నాయిడి రవి, బద్దం పోతరెడ్డి, సద్దాం, మందుల రమేశ్, ఉన్నారు.

ముఖ్యమంత్రికి విన్నపాలు

» అడవుల ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగేలా సీఎం చొరవ చూపాలి
» ఏజెన్సీ డీఎస్సీ, ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ, ఉట్నూర్ కేంద్రంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి
» బోథ్‌లో రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

ఉట్నూర్/బోథ్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావించాక ఉట్నూర్ కేంద్రంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి నందున అవసరమైన డాక్టర్లను నియమించాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డి గురువారం జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు వైద్యో నారాయణో హరి అంటున్నారు. ఉట్నూర్‌లోని 50ప డకల ఆసుపత్రిని 100 బెడ్స్ ఆసుపత్రిగా మారుస్తూ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఉన్న జిల్లా ఆసుపత్రిని ఉట్నూర్‌కు తరలించి జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చే స్తామని గత తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వంలో ఉ త్తర్వులు జారీ చేసిన నేటికి అమలు కాలేదు.

డాక్టర్ల సిబ్బంది కొరత

ఉట్నూర్‌లోని వంద పడకల ఆసుపత్రికి యాభై ప డకల వైద్య సిబ్బందిని కొనసాగిస్తున్నారు.ఆ సిబ్బంది సైతం సరిగ్గా లేరు. స్త్రీ వైద్యనిపుణురాలు, పిల్లల డా క్టర్, మత్తు డాక్టర్‌తో పాటు మరో డాక్టర్, నలుగురు మాత్రమే ఉన్నారు. 12 మంది ఆసుపత్రిలో డాక్టర్లు ఉండాల్సి ఉండగా కేవలం నలుగురుతో మాత్రమే వై ద్య సహాయం అందిస్తున్నారు. వంద పడకల ఆసుప త్రికి మరో 12 మంది డాక్టర్లు అవసర ముంటుంది. అంటే మొత్తం 24 మంది వైద్యనిపుణులు కావాల్సి ఉం డగా కేవలం నలుగురు మాత్రమే ఉ న్నారు. అదే విధంగా డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 12 మంది అవస రం కాగా 9 మంది ఉన్నారు. 100 ప డకల ఆసుపత్రికి మరో 12 మంది డి ప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్లు కావా ల్సి ఉంది. 50 పడకల ఆసుపత్రికి కా వాల్సిన సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 21 మంది ఉన్నప్పటి కి వంద పడకల ఆసుపత్రికి కావాల్సిన మరో 32 మంది డాక్టర్లను నియమించాల్సి ఉంది. అదే విధంగా వంద పడకల ఆసుపత్రికి కాల్సిన 26 మంది స్టాఫ్ న ర్స్‌లో ఉండాల్సి ఉండగా 12 ఖాళీలు ఉన్నాయి. నర్సింగ్ సూపర్‌వైజర్ గ్రేడ్ వన్ ఒకటి ఖాళీ ఉంది. హెడ్‌న ర్సులు ఐదుకు మూడు ఖాళీలు ఉన్నాయి. ఏఎన్‌ఎంలు ఆరుకు నాలుగు ఖాళీలు ఉన్నాయి. రెండు సీనియర్ అసిస్టెంట్లు, ఒకటి జూనియర్ అసిస్టెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు జైనూర్, సిర్పూర్ యు, లింగాపూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల ప్రజలు వైద్యం కోసం ఉట్నూర్‌కు వస్తుంటారు. ఇక్కడ సరైన వైద్యం అందనప్పుడు రోగులను జిల్లా కేంద్ర ఆసుపత్రి కి తరలిస్తున్నారు. గత జూన్ 27న జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు ఆధ్వర్యంలో రూ.13.70కోట్ల తో వంద పడకల ఆసుపత్రికి కావాల్సిన అదనపు భవ నాల నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేసిన నేటికి ప నులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా వైద్య సేవలు అందేలా అప్‌గ్రేడ్ చేసిన జిల్లా ఆసుపత్రికి కావాల్సిన సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



ఉట్నూర్‌లోని జిల్లా ఆసుపత్రి

ఇందిరమ్మ ఇళ్లకు అడ్డంకులు తొలగించాలి

గిరిజన ప్రాంతాల్లోని అడవుల సమీపంలో అనాది గా నివాసం ఉంటున్న పీవీటీజీ గిరిజనుల కోసం ప్ర భుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కొనసాగించేలా సీఎం చొరవ చూపాలని కోలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరా వు, రాష్ట్ర నాయకులు కుంరరాజు కోరుతున్నారు.

సీఎం ఆదివాసులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి: తుడుం దెబ్బ

సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని ఆదివాసులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తుడందెబ్బ రా ష్ట్ర కార్యదర్శి పుర్కబాపురావు డిమాండ్ చేశారు. బుధ వారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ గురువారం జిల్లాకు వస్తున్న సీఎం ఆదివాసీ ప్రతినిధు లకు ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. ఏజెన్సీ డీఎస్సీ ఏర్పాటు, బీఎడ్‌కళాశాలలో పూర్తి స్థాయి అధ్యాపకులు నియామకం, ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భ ర్తీ, ఉట్నూర్ కేంద్రంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు, డీ ఎడ్ కళాశాల పునరుద్ధరణ, ఐటీడీఏలను బలోపేతం చేయడం. అప్పటి చీఫ్ సెక్రటరీ శాంతికుమారుని ఆది వాసుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదే శాలు జారీ చేసినప్పటికి ఇప్పటి వరకు మా సమ స్యలు యదావిధంగానే ఉన్నాయని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ కార్యదర్శి తెలిపారు.



ఉట్నూర్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినజిల్లా ఇన్‌చార్జి మంత్రిజూపల్లి

బోథ్ ప్రజలకు ఇచ్చిన హామీలు మరిచారా..!

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష నాయ కుని హోదాలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన ప్రస్తుత ముఖ్యమంత్రి రే వంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో బోథ్ ప్రజలకు ఇచ్చిన హామీలు మర్చిపోయారా..! అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు బోథ్‌లో రె వెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రి లే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది. అంతేకాక స్థానిక యువకుల కోసం స్టేడియం ఏర్పాటు అగ్నిమా పక కేంద్రం, జనరల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తా మని హామీ ఇవ్వడం జరిగింది. అయితే అధికారంలో వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో ఏ ఒక్క హామీ కూడా అమలు కాక పోవడంతో ఇప్పుడనా ముఖ్య మంత్రి గారు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చా లని కోరుతున్నారు.

ఎద్దు పై పులి పంజా



బీంపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆది లాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్కోటి శివారులో మళ్లీ పెద్దపులి పంజా విసిరింది. బాధితరైతు, అటవీశాఖ అధికారుల కథనం ప్రకారం పిప్పల్కోటికి చెందిన రైతు జము రుల్లా మంగళవారం రాత్రి తన చేనులోనే ఉన్న కొట్టంలో ఎడ్ల జతను కట్టి వేసి ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో బుధవారం తెల్లవారు జామునమయంలో పెద్దపులి ఎడ్లజతపై దాడి చేయగా ఒకఎద్దు మృతి చెందింది. ఈ విష యాన్ని రైతు బుధవారం ఉదయంగమ నించి అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అహ్మద్‌ఖాన్ సిబ్బంది కృష్ణతో కలిసి అధికా రుల ఆదేశాలతో అక్కడికి చేరుకొని పంచ నామాచేశారు.అదిపులి దాడిగానే ధ్రువీకరిం చారు.ఆతరువాత స్థానికరైతులకు అవగాహన కల్పించారు.గుంపులుగా పంటచేన్లకు వెళ్లాలని పంటల రక్షణకు విద్యుత్ కంచాలు అమర్చరా దని స్థానికులకు సూచించారు. ఈప్రాంతం వైపు అనుమానిత వ్యక్తులు వస్తే తమకు స మాచారం ఇవ్వాలని అన్నారు. కాగా ఈఎద్దు విలువ రూపాయలు లక్ష ఉంటుందని బాధిత రైతుతెలిపాడు.కాగా పరిహారం కోసం ప్రభు త్వానికి నివేదిస్తామని అధికారులు అన్నారు. పిప్పల్కోటి శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చి రెండు బృందాలుగా ఏర్పడి పులి సం రక్షణ చర్యలు చేపట్టారు.

ఏళ్లుగా పులి సంచారం

ఇదిలా ఉంటే పిప్పల్కోటి కారిడార్‌లో దా దాపుగా దశాబ్దకాలంగా పులి సంచారం అప్పు డప్పుడు వస్తుంది. ఇటీవలనే నెల క్రితం ఈ ప్రాంతంలో పులి కదలికలు కనిపిం చా యి. ఆతర్వాత పులిమహారాష్ట్ర తిప్పేశ్వర్ అడవుల వైపు వెళ్లిందని భావించారు.ఆతరువాత ఆక స్మికంగా పులిదాడి ఇలాజరిగింది.ఇదిలా ఉంటే దశాబ్దంనర కాలంగా పులులు తిప్పేశ్వర్ అభ యారణ్యం నుంచి ఈప్రాంతానికి వచ్చి దా దాపు 25కిలో మీటరూ ఉన్న కారిడార్‌లో ఉండటం ఆతరువాత తిరిగి వెళ్లటం జరుగు తూనే ఉన్నది. ఇప్పటి వరకు పదుల సంఖ్య లో పశువులపై దాడి జరుగగా అధికారులు పరిహారం ఇప్పించారు. అలాగే నిరంతరం అవగాహన కల్పిస్తూ స్థానికుల్లో ధైర్యం నిం పుతూ వస్తున్నారు. పులి సంరక్షణ అందరి బాధ్యత కనుక స్థానికులు వేట గాల్లా కదలి కలపై వెంటనే సంచారం ఇవ్వాలని చెప్తూ వస్తున్నారు. ప్రభుత్వం పత్తి ఇతర పంటలు ఉన్న నేపథ్యంలో కొంత భయం ఉన్నకూడా అధికారుల అవగాహనతో స్థాని కులు అప్రమ త్తంగా ఉంటూ పనులు చేసు కుంటున్నారు. అధికారుల అప్రమత్తతోనే ఇంత వరకు ఈ ప్రాంతంలో మనుషులపై దాడులు జరుగ లేదు ఏదిఏమైన పులి సంచారంపై అం దరూ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.



పులి దాడిలో మృతి చెందిన ఎద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్రైం సమాచారం

ఫిట్స్‌తో ఒకరి మృతి



మృతుడు ఇరీష్

కుభీర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పార్డి(బి) గ్రామానికి చెందిన నాగుపల్లి ఇరీ ష్(40) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఇరీష్ అనారోగ్యం కారణంగా ఫి ట్స్ వస్తుందని, ఈ క్రమంలో మంగళవారం ఉద యం 9 గంటల సమయంలో మొక్కజొన్న పంటకు నీళ్ల పెట్టడానికి కూలిపనికి వెళ్లగా ఆసమయంలో చేన్లో ఇరీష్‌కు ఫిట్స్ రావడంతో బోర్ల పడడంతో మృ తుడికి ముక్కులోకి, నోట్లోకి నీళ్ల వెళ్లి ఊపిరాడక చనిపోయాడని తెలిపా రు.ఈమేరకు మృతుడి తండ్రి నాగులపల్లి ఎర్రన్న ఫిర్యాదుమేరకు కేసున మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రజాసేవలో రెండేళ్లు..



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల నాయకులు

నేరడిగొండ, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ శాసనస భ్యులుగా అనిల్ జాదవ్ గెలుపొంది, ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టి నేటితో రెండు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో/క్యాంపు కార్యాలయంలో మండల నాయకులు, కార్యక ర్తలు అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రెండేళ్ల పాలన పూర్తయిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని నాయకులు ఎమ్మె ల్యేకు పుష్పగుచ్చాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్వీట్లు పంచిపెట్టి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

గుడ్డి పత్తి పంటను పండించొద్దు

ముథోల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):గుడ్డిపత్తి (గింజలులేనిపత్తి)గులాబీ పురుగుతో పత్తి పంట ను కొనసాగించ రాదని ముథోల్ వ్యవసాయ పరి శోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కార్తీక్, డాక్టర్ దినేష్‌లు తెలిపారు.ఈసందర్భంగా పలు సూచన లు ఇచ్చారు.డిసెంబరు నెలచివరి వరకు పత్తితీత పూర్తి చేయాలి.అలాగేపత్తిపంట సాగును జనవరి వరకు పొడిగించరాదన్నారు.పొడిగించినచో గులా బీ రంగు పురుగు ఉధృతి ఎక్కువ గుడ్డిపత్తి ఎ క్కువగా వస్తుందన్నారు. పత్తికట్టెను రోటవేటర్ లేదాష్రెడ్డర్‌తో భూమిలో కలియదున్నాలి.తర్వా రా నేలసారవంతం అవుతుంది.అలాగే నెలలో కర్బన శాతంపెరుగుతుంది.పత్తికట్టెనుకాల్చరాదు.గులాబీ రంగు పురుగుసోకిన పత్తినిలువ చేయరాదు. పత్తి ఏరినచేనులో గొర్రెలనులేదా పశువులను మేపాలి. నీటి వసతులు ఉన్నచోట పత్తి అడుగుల్లో రెండో పంటగా మొక్కజొన్న,జొన్న, బొబ్బెర, పెరస లేదా కూరగాయలాంటి పంటలను వేసుకోవాలన్నారు.

ఘనంగా డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ జయంతి

నిర్మల్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని బుధవార్ పేట్ స రస్వతి శిశు మందిర్ పాఠశాలలో డాక్టర్ బాబురాజేంద్ర ప్రసాద్, కుదిరం బోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించినట్లు పాఠశాల హెచ్‌ఎం కొండూ రు నరేష్ తెలిపారు. ఈకార్యక్రమం లోఆచార్యులు,విద్యార్థులు పా ల్గొన్నారు.





కింది నుంచి చిన్నారులకు సూచనలు చేస్తున్న గురువులు - వేదికపై ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

దివ్యాంగులకు..గురుబోధ

జీవితంలో ప్రతీ ఒక్కరికి గురువు మార్గనిర్దేశనం తప్పనిసరి. చీకటి నుండి వెలుగులోకి నడిపే శక్తి ఉన్న ఆచార్యులను దైవంగా భావించడం భారత దేశ సంస్కృతి. ఇదే విషయాన్నీ కళ్లకు కట్టినట్లు చూపిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో చోటు చేసుకుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులకు ధైర్యంగా వారు తప్పులు చేయకుండా ఎదుట వారి గురువులు ప్రదర్శన చేయడం, వారిని అనుకరించి చిన్నారులు నృత్యం చేసి ఆహుతుల ప్రశంసలు పొందడం జీవితంలో ఆచార్యుల ప్రాధాన్యతను చాటి చెప్పింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ముఖ్యమంత్రికి..
విన్నపాలు

- ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- కోలాం గిరిజనుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు అడ్డంకులను తొలగించాలి
- బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించరూ! : స్థానికులు

మరిన్ని క్లుప్తంగా 7వ పేజీలో...

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో..
పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు


పోలీసు యంత్రాంగం విడుదల చేసిన ట్రాఫిక్ ఆంక్షల రూట్ మ్యాప్

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో గురువారం పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు కానున్నాయి. అంకోలి, తంతోలి వైపు నుంచి వస్తున్న గ్రామ ప్రజలు పట్టణంలోని కేఆర్‌కే కాలనీ మీదుగా, మావల పోలీస్ స్టేషన్ మీదుగా తిరుమల పెట్రోల్ బంక్ మీదుగా పట్టణానికి చేరుకోవాలని, ఆర్‌ఆర్ కాలనీ, హ్యాండీక్యాఫ్ట్ కాలనీ ప్రజలకు అదే నియమాలు వర్తిస్తాయని పోలీసులు తెలిపారు. స్థానిక ఏరోడ్రం వద్ద నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కలెక్టర్ చౌరస్తా వరకు సాధరణ ప్రజలకు అనుమతులు ఉండవని, ప్రజలు నిత్యవసరాల కోసం పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలన్నారు. వీఐపీ వాహనాలు ఎన్టీఆర్ చౌక్ మీదుగా కాన్వెంట్ స్కూల్ ముందు నుంచి సరస్వతీ శిశు మందిర్, టీటీడీ కల్యాణ మండపానికి చేరుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాలలో పార్కింగ్ చేసిన తర్వాత నడక మార్గంలో ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ దారిలో మీటింగ్‌ప్రదేశానికి చేరుకోవాలన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లో తప్ప వేరే రూట్లలో, రోడ్డుపై పార్కింగ్ చేయరాదని, ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో ప్రజలు సహకరించాలని తెలిపారు.


పీవోను కలిసిన సంస్థ ప్రతినిధులు

పీవోకు చెక్కు అందజేత

ఉట్నూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ-ఉట్నూర్ పరిధిలో సీఎస్ఆర్ యాక్టివిటీస్ కోసం ఏటా టెక్ పోర్ట్స్ ప్రవేట్ లిమిటెడ్-హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు చెక్కు అందజేయడం జరిగిందని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ తెలిపారు. బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ఏటా టెక్ పోర్ట్స్ ప్రవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు కలిసి రూ.3లక్షల చెక్కును ప్రాజెక్టు అధికారికి అందజేశారు.


లడ్డు తయారీలో నిమగ్నమైన భక్తులు

దత్త జయంతికి లడ్డూలు

బోథ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా తాడ్వాయి శబరిమాత ఆశ్రమంలో ప్రతీయేడు జరిగే దత్త జయంతి వేడుకలకు బోథ్ మండలంలోని కౌట(బి) శబరిమాత ఆశ్రమంలో భక్తులు లడ్డు ప్రసాదని తయారు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ యేడు కూడా భక్తులు లడ్డు ప్రసాదాన్ని తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇక్కడి లడ్డులను ప్రసాదంగా భక్తులకు విక్రయించడం జరుగుతుంది. లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా వచ్చిన ఆదాయాన్ని తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో ఆశ్రమం తరపున చందాగా అందించడం జరుగుతుందని స్థానిక భక్తులు తెలిపారు.


రిమ్స్‌లో నిర్మించిన క్రిటికల్ కేర్ ఆసుపత్రి



జిల్లా కేంద్రంలో నిర్మించిన కేంద్రీయ విశ్వ విద్యాలయం

పోటాపోటీ

సెంట్రల్ వర్సెస్ స్టేట్

జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల విషయంలో సెంట్రల్ వర్సెస్ స్టేట్ అన్నట్లుగా మారింది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య పోటాపోటీ అన్నట్లుగా కనిపిస్తుంది. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన అధికార కాంగ్రెస్ పరిస్థితులను అనుకూలంగా మల్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఇందులో భాగంగానే గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

- జిల్లాలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య కోల్డ్‌వార్
- రిమ్స్‌లో క్రిటికల్ కేర్, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ప్రారంభోత్సవాలకు బ్రేక్
- కేంద్ర మంత్రులతో ప్రారంభించేందుకు బీజేపీ నేతల ప్లాన్
- అధికార, ప్రతిపక్ష నేతల నిర్ణయాలతో జిల్లా అధికారుల్లో అయోమయం
- నేడు జిల్లాలో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఆదిలాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు జిల్లాలో మాత్రం భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఖానాపూర్ నియోజక వర్గంలో మినహా ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలే కొనసాగుతున్నారు. దీంతో కాంగ్రెస్‌కు కొంత ఇబ్బందికర పరిస్థితులు తప్పడం లేదు. స్థానిక ఎన్నికలకు ముందు సీఎం జిల్లా పర్యటన ఖరారు కావడంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ గత ఆరు మాసాల క్రితమే జిల్లా కేంద్రంలో నిర్మాణ పనులు పూర్తయినా- కేంద్రీయ విశ్వవిద్యాలయం, రిమ్స్‌లో నిర్మించిన క్రిటికల్ కేర్ ఆసుపత్రి ప్రారంభోత్సవాలపై జిల్లా అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత లేని కారణంగానే క్రిటికల్ కేర్, కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవాలను వాయిదా వేసినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతుంది. మరోవైపు సీఎం టూర్ నేపథ్యంలో భారీ జన సమీకరణకు కాంగ్రెస్ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

అనుమతించని కేంద్రం: జిల్లా కేంద్రంలో నిర్మించిన క్రిటికల్ కేర్, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ప్రారంభోత్సవాలకు

- మిగతా 6లో

సీఎం షెడ్యూల్ ఇలా..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి గురువారం మధ్యాహ్నం 1.20 గంటలకు ప్రత్యేక హెలిక్యాప్టర్ లో బయలుదేరి 2గంటలకు జిల్లాకేంద్రంలోని ఎరోడ్రమ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 2.10 నిమిషాలకు ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు చేరుకుంటారు. 2.10 నుంచి 2.15 వరకు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. 2.20కి బహిరంగ సభా వేదికపైకి చేరుకుంటారు. 2.30 నుంచి 2.45 వరకు ఎమ్మెల్యే ప్రసంగిస్తారు. 2.45 నుంచి 2.55 వరకు ఇన్‌చార్జి మంత్రి ప్రసంగం, 2.55 నుంచి 3.35 వరకు ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. 3.35 నుంచి 3.40 వరకు ఇందిరా మహిళా శక్తి బ్యాంకు లింకేజీ చెక్కుల పంపిణీ. తిరిగి 3.45 నుంచి 3.50 హెలిప్యాడ్ వద్దకు చేరుకుని బయలుదేరి వెళ్తారు.

మూడో విడత..
నామినేషన్ల దాఖలు షురూ..

బజార్‌హత్నూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం మొదలైంది. ఏడు క్లస్టర్‌లలో తొలి రోజు 31 సర్పంచ్ స్థానాలకు గాను 17 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఇందులో బజార్ హత్నూర్, గిర్నూర్, మాన్కపూర్, బోస్రా, గంగాపూర్, మోర్ఖండి, భూర్కాపల్లి, ఏసాపూర్, కాండ్లి, మంజరం తండా, అనంతపూర్‌లలో ఒక్కొటి, గంగాపూర్, చందునాయక్ తండా, పిప్పరిలలో రెండు చొప్పున సర్పంచ్‌కు నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే 224 వార్డు స్థానాలకు 11 వార్డు సభ్యులు నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరించారు.

నేరడిగొండ: నేరడిగొండ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. నేరడిగొండ మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉండగా. 14 మంది సర్పంచ్ అభ్య ర్థులు, 19 మంది వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఎంపీడీవో శేఖర్ తెలిపారు.

తలమడుగు: మండలంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు 15 మంది అభ్యర్థుల దరఖాస్తు చేసుకున్నారని ఎన్నికల రిటర్న్ అధికారి, ఎంపీడీవో శంకర్ తెలిపారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు క్లస్టర్‌గా విభజించి దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 29 సర్పంచ్, 238 వార్డులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నమన్నారు. మొదటిరోజు 15 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, అదేవిధంగా 17 మంది వార్డు మెంబర్లు దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీవో శంకర్ పేర్కొన్నారు.

ఉట్నూర్ మేజర్ పంచాయతీకి
15 మంది సర్పంచ్ అభ్యర్థులు

- 18 వార్డులకు గానూ 56 మంది పోటీ

ఉట్నూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం కోసం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సులోచన ఒకరే నామినేషన్ ఉపసంహరించుకోవడంతో 15 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో మిగిలారు. పంచాయతీ రిధిలోని 18 వార్డుల కోసం 65 మంది నామినేషన్లు దాఖలు చేయగా బుధవారం నామినేషన్ల ఉప సంహారణ గడువు ముగిసే వరకు 9 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు ఉప సంహరించుకోవడంతో 56 మంది పోటీలో నిలబ్డారు. ఉ ట్నూర్ మండలంలో 38 గ్రామ పంచాయతీలకు గాను ఏకగ్రీవంగా పాలక వర్గాలు ఎన్నిక కాగా మిగిలిన 32 గ్రామ పంచాయతీలకు 128 మందిసర్పంచ్ అభ్యర్థులు ఉపసంహరణల అనంతరం రంగంలో మిగిలినట్లు స్థానిక ఎన్నికల అధికారులు తెలిపారు.

ప్రజాహితమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన


సభ వేదిక వద్ద మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజాహితమే ప్రభుత్వ లక్ష్యం అని, పదేళ్లలో బీఆర్ఎస్ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గురువారం సీఎం ఆదిలాబాద్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల ప్రజా పాలనలో ప్రభుత్వం చేసిన మంచి పనులకు గుర్తుగా ప్రజా పాలన విజయోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ అభివృద్ధికి రూ.18కోట్లు మంజూరు చేశామని, మరో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందులో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాస రెడ్డి, ఆడె గజేందర్, శ్యాంనాయక్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్ రెడ్డి, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం సాయంత్రం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సభ వేదిక వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అధికారులు గుర్తించిన పులి పాదముద్ర

ఎద్దుపై పులి పంజా

- పిప్పల్కోటి శివారులో ఘటన
- భయాందోళనలో రైతులు

మరిన్ని వివరాలు 7వ పేజీలో...

చలి చంపుతోంది!

- బజార్‌హత్నూర్‌లో అత్యల్పంగా 10.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఆదిలాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలితీవ్రత పెరిగిపోతుంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా జనం వణికి పోతున్నారు. బుధవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.3 కాగా కనిష్ఠగా 10.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 10.0, బీంపూర్ మండలం అర్లి(టి)లో 10.4, బోథ్ మండలం పొచ్చెరలో 10.8, తలమడుగులో 11.0, సాత్నాలలో 11.1, ఆదిలాబాద్‌అర్బన్‌లో 11.2, సోనాలలో 11.3, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.జిల్లా వ్యాప్తంగా 20డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మళ్లీ చలిప్రభావం పెరగడంతో ప్రజలు వెచ్చని దుస్తులు ధరించి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉదయం రాత్రి వేళల్లో చలిమంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు. మరికొన్నాళ్ల పాటు జిల్లాపై చలిప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.


జిల్లాకేంద్రంలో కమ్ముకున్న పొగమంచు

ఆత్మస్థైర్యంతో..
అన్ని రంగాల్లో రాణించాలి

- అదనపు కలెక్టర్ శ్యామల దేవి
- ఆకట్టుకున్న బాలల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు
- జిల్లాలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో లోపాలను ఎత్తి చూపకుండా వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపి అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సాహం అందించాలని అదనపు కలెక్టర్ శ్యామల దేవి సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దివ్యాంగులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పలు సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ.... దివ్యాంగులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందులో డీడబ్ల్యూఓ మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన, దివ్యాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.


జడ్పీలో చిన్నారులకు కేక్ కట్ చేసి తినిపిస్తున్న జిల్లా అధికారులు

దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు : పీవో

ఉట్నూర్: దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న వికాసం ప్రత్యేక పాఠశాలలో బుధవారం నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. దివ్యాంగుల అవసరాల దృష్ట్యా వారికి కావల్సిన సహాయ ఉపకరణాలు, దివ్యాంగ పిల్లలకు కావల్సిన సహాయం అందించడం జరుగుతుందన్నారు.గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబాజిజాదవ్, ఉట్నూర్‌ఏటీడీఓ సదానందం, ఆదిలాబాద్ ఏటీడీఓ నిహారిక, బోథ్ ఏటీడీఓ, ఏసీఎంఓ జగన్, ఐటీడీఏ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ రాథోడ్‌మాణిక్‌రావు, తదితరులుపాల్గొన్నారు.

అలాగే, మండంలోని గంగన్నపేట ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న విలీన విద్య వనరుల భవిత కేంద్రంలో బుధవారం ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్‌కైలాస్, మండల విద్యావనరుల సమన్వయకర్త, సీడీపీఓ ఉమాదేవి, సీడీఎస్ టీచర్‌రత్నమాల, ప్రత్యేక ఉపాధ్యాయురాలు సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: చదువుకు అంగవైకల్యం అడ్డురాదని పట్టుదలతో చదివితే సాదించనిది ఏమి లేదని బోథ్ మండల విద్యాధికారి మహమ్మద్‌హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ స్టీఫెన్ హాకింగ్ పూలమాలలు వేయడం జరిగింది. అలాగే, బుధవారం మండల కేంద్రంలో వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ఆవరణలో ఉన్న ఐఈఆర్సీ భవనంలో బుధవారం దివ్యాంగుల విద్యార్థులకు ఆటల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి భూమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. అంతకు ముందు ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.


ఉట్నూర్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో


నృత్యాలు చేస్తున్న బాలబాలికలు


బజార్‌హత్నూర్‌లో ర్యాలీ

16, 17)ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో